క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని కొలిచారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థి మిత్ర కిట్లు అందజేస్తున్న విద్యా కమిటీ చైర్మన్లు, గ్రామ నాయకులు

సామర్లకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందజేస్తున్నారు. శుక్రవారం హుస్సేన్‌పురం గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల 1, 2లకు చెందిన విద్యా కమిటీ చైర్మన్లు కోట అప్పలరాజు, పలివెల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు ఇచ్చారు. గ్రామ నాయకులు చల్లా బుజ్జి, మార్ని సూర్యారావు, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

పెద్దాపురం: మానవత్వ విలువలు కలిగిన మహోన్నతుడు దివంగత మాజీ కౌన్సిలర్, సీపీఎం నేత యాసలపు సూర్యారావు అని పలువురు వక్తలు అన్నారు. సూర్యారావు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు, సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సూర్యారావు ముందుండే వారన్నారు. అనంతరం పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త సందక శ్రీను, తాళ్లూరి శేఖర్, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



రవి, కోచ్ సునీల్ దేశాయ్‌లను అభినందిస్తున్న గుంటూరు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

పిఠాపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోల్‌వాల్ట్ విభాగంలో పిఠాపురానికి చెందిన విద్యార్థి సాలా రవి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించినట్లు కోచ్ ఎలిపే సునీల్ దేశాయ్ తెలిపారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ స్టేట్ అథ్లెటిక్స్‌లో రవి పాల్గొన్నాడన్నారు. పిఠాపురంలో డిగ్రీ చదువుకుంటున్న రవికి ఇప్పటి వరకూ అథ్లెటిక్స్‌లో పోల్‌వాల్ట్ అండర్ 17, 18, 19, 20 సీనియర్స్ మీట్‌లలో 16 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో స్పృహతప్పి పడిపోయిన మహిళ

కరప: తన కుమార్తె ఆచూకీ తెలిసిందా అని అడగటానికి వెళ్లిన ఒక మహిళ కరప పోలీస్ స్టేషన్‌లో స్పృహతప్పి కింద పడిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. కరప గ్రామానికి చెందిన బాలిక (15)ను ఇదే గ్రామానికి చెందిన ఒక యువకుడు ఈ నెల 8న కిడ్నాప్ చేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె ఆచూకీ తెలియక తల్లి అప్పటి నుంచి ఆహారం తీసుకోవడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బాలిక తల్లిదండ్రులు, బంధువులు తమ కుమార్తె ఆచూకీ తెలుసుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడున్న కుర్చీల్లో కూర్చున్నారు. అప్పటికే నీరసించి ఉన్న బాలిక తల్లి స్పృహతప్పి కింద పడిపోయింది. ఎస్సై టి.సునీత స్పందించి వైద్యం నిమిత్తం ఆటోలో వేళంగి పీహెచ్‌సీకి పంపించారు. డాక్టర్ శ్రీనివాస్ నాయక్ ఆమెకు వైద్య సేవలందించారు.

అతిసార రాకుండా..!

- గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది
- వ్యాధి నియంత్రణకు పక్షోత్సవాలు
- జాగ్రత్తలు పాటించాలంటూ ప్రచారం



గొల్లప్రోలు నగర పంచాయతీలో ఓఆర్ఎస్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పిఠాపురం: జూన్‌లోనూ ఎండలు మండుతున్నాయి.. అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నా ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఇక వచ్చే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉండడంతో పాటు ప్రజలు అతిసార బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వైద్య సిబ్బంది గ్రామాల బాట పట్టారు. పిఠాపురం నియోజకవర్గంలో మల్లాం, విరవ, కొమరగిరి, నాగులాపల్లి, కొత్తపల్లి, గొల్లప్రోలు, చేబ్రోలులలో పీహెచ్‌సీలు ఉన్నాయి. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణంలో యూ పీహెచ్‌సీలు, పిఠాపురంలో సీహెచ్‌సీ ఉంది. గ్రామాల్లో సిబ్బంది పర్యటిస్తూ అతిసార బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 16 నుంచి 31 వరకూ అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా ఎండలో పని చేసేవారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తూ అతిసార రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా అతిసార వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. వేసవి ప్రతాపంతో జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వేసవి ప్రతాపంతో అతిసారకు గురయ్యే పరిస్థితుల్లో పిల్లల తల్లులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి జాగ్రత్తలు వివరిస్తున్నారు.

చేయకూడనివి..

తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా బయట తిరగకూడదు. రోడ్ల పక్కన విక్రయించే చల్లని రంగుల పానీయాలు తాగరాదు. రోడ్ల పక్క అమ్మే ఆహారం తినరాదు. మాంసాహారం తినడం తగ్గించాలి. తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యం తాగడం మానేయాలి.

చేయాల్సినవి..

నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నలుపు, మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులను మాత్రమే వినియోగించాలి. రోజూ కనీసం 15 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. ఎండ వేళ ఇంటి పట్టునే ఉండాలి, బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వాడాలి. ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచుకోవాలి. పిల్లలను ఎండలోకి వెళ్లనివ్వరాదు.

వ్యాధి బారిన పడితే..

ఎవరైనా అతిసార వ్యాధికి గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకూ చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో శరీరమంతా తుడవాలి. చల్లని గాలి తగిలేలా ఏర్పాట్లు చేయాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణం పట్టించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండాకాలంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న రోగికి వెంటనే నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించి వెంటనే వైద్య సేవలు అందించేలా చూడాలి. పిల్లలకు విరోచనాల సమయంలో, తగ్గిన తరువాత తల్లి పాలు, నోటి ద్రావణాలు ఇవ్వాలి. పరిశుభ్రత ఎక్కువగా పాటించాలి. విరోచనాలకు గురైన చిన్నారులకు వైద్య సిబ్బంది సూచనలతో తల్లి పాలు, ఓఆర్ఎస్ ద్రావణం, నిర్దేశించిన మోతాదులో జింక్ మాత్రలు వేయాలి.

ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం

ఎండాకాలంలో పెద్దలు, పిల్లలు అతిసార బారిన పడకుండా ప్రభుత్వ ఆదేశాలతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఇప్పటికే గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాల్లో సచివాలయాలు, ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓఆర్ఎస్ క్యాంపెయిన్స్ నిర్వహించడంతో పాటు ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం.

– అహ్మద్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు

వర్షంతో స్తంభించిన జనజీవనం



వాకతిప్పలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: మండలంలోని శుక్రవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో కాస్త సేదతీరారు.

29న కంటి వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక కన్యకా పరమేశ్వర సత్రంలో ఈ నెల 29న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు భవర్‌లాల్ డి.జైన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది గురుపూర్ణమి సందర్భంగా గత 16 ఏళ్లుగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు కంటి సమస్యలు లేకుండా చేయడానికి తమ వంతు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ 1,915 మందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు.

వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి



దొరబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాంబాబు తదితరులు

సామర్లకోట: ఇటీవల నియమితులైన వైఎస్సార్ సీపీ మండల కమిటీ నాయకులు శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలూ కృషి చేస్తామని అన్నారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు నిడదవోలు రాంబాబు, మండల పార్టీ కార్యదర్శి వేగుళ్ల రమణమూర్తి, పార్టీ కమిటీ సభ్యుడు బి.శ్రీను, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు జక్కా మణికంఠలు మాట్లాడుతూ పార్టీ కమిటీల నియామకంలో సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఈ మేరకు దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిడదవోలు సురేష్‌చౌదరి, వల్లూరి పెద్ద, మాకిరెడ్డి రాంబాబు, సతీష్ మాస్టారు, చిట్టూరి శ్రీను, దూళ్ల బీమరాజు, థామస్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఏం చేశారో చెప్పండి

- నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- సీపీఐ మహాసభలో తాటిపాక మధు



సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

పిఠాపురం: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను గెలిపిస్తే తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశపడిన ప్రజలకు నిరాశే ఎదురైందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో అభివృద్ధి ఎక్కడా జరగలేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. స్థానిక సూర్యారాయ గ్రంథాలయంలో శుక్రవారం కేశవరపు అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ 16వ నియోజకవర్గ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిఠాపురం నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ వందలాది దరఖాస్తులు అధికారులకు ఇచ్చామని, ఖాళీ స్థలాల్లో సీపీఐ భూ పోరాటం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఉప ముఖ్యమంత్రి పవన్‌కు లెటర్ రాసినా స్పందన లేదన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2019లో కరోనా కాలంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చిందని తెలిపారు. రక్షణ సౌకర్యాలు కల్పించకుండా మహిళలతో రాత్రి షిఫ్టులలో పని చేయించుకునేందుకు యాజమాన్యానికి స్వేచ్ఛ ఇస్తూ, శ్రామిక మహిళల హక్కులను కాలరాస్తూ చట్టంలో సవరణలు తెచ్చిందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపివేయాలని మధు డిమాండ్ చేశారు. జూలై 15, 16 తేదీల్లో సామర్లకోటలో జరిగే సీపీఐ కాకినాడ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దళిత సర్పంచ్‌ను అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సీపీఐ పిఠాపురం పట్టణ కార్యదర్శి శాఖ రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.సత్యనారాయణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవాని, అరుణ, నాయకులు రెడ్డి గోవింద్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో మన ఊరు - పనితీరు




రమణక్కపేటలో ఉపాధి శ్రామికులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తపల్లి: రమణక్కపేట గ్రామంలో శుక్రవారం మన ఊరు- పనితీరు, పారదర్శక బోర్డులను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు ప్రారంభించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, విద్య, లక్ష్యాలు, ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామం ముఖ చిత్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో కలసి అధికారులు కాలువలో పూడిక తీశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం ఏపీఓ కొండలరావు మాట్లాడుతూ కూలీలు వంద రోజుల పని పూర్తి చేసుకుని జీవనోపాధి మెరుగుపరుచుకోవాలన్నారు. 2025 నుంచి ప్రభుత్వం కొత్త చట్టం ప్రకారం జరిగిన ఆడిట్, ఉపాధి పనులకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతారన్నారు. ముఖ్యంగా ఉపాధి పనులు చేసేవారిని శ్రామికులుగా పిలవాలన్నారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధి పనులపై అవగాహన కల్పించినప్పుడే పనుల్లో అవకతవకలను అరికట్టవచ్చన్నారు.

చీకటి... ఆ మాటేమిటి!

- అంధకారంలో సీబీఎం సెంటర్
- విద్యుత్తు స్తంభం ఏర్పాటులో జాప్యం





రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్న సీబీఎం సెంటర్ (అంతరచిత్రం) ఇక్కడే ఒరిగిన విద్యుత్తు స్తంభం (ఫైల్)

సామర్లకోట: అధికారుల నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతోంది.. ఫలితంగా సామర్లకోట సీబీఎం సెంటర్ అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ విద్యుత్తు స్తంభాన్ని లారీ ఢీకొనడంతో ఒరిగిపోయింది. ఆ స్తంభం ఎప్పుడైనా పడిపోయే ప్రమాదం ఉందనే ఫిర్యాదుల మేరకు మున్సిపల్ అధికారులు సుమారు మూడు నెలల కిందట దానిని తొలగించారు. అయితే ఆ స్తంభం స్థానంలో మరొకటి ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో అంధకారం అలముకుంటోంది. సామర్లకోట పోలీస్ స్టేషన్ మీదుగా కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురానికి వెళ్లేందుకు ఈ కూడలి ప్రధానమైంది. కిర్లంపూడి రోడ్డులో ఈటీసీ లేఅవుట్‌లో జగనన్న కాలనీ ఉండటంతో ఆ ప్రాంతంలో సుమారు రెండు వేల మంది నివాసం ఉంటున్నారు. దాంతో ఆ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటువంటి కూడలి ప్రదేశంలో విద్యుత్తు దీపాలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని గత మూడు కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించడం లేదని ఆమె అన్నారు. పెద్దాపురం నుంచి కిర్లంపూడి, పిఠాపురం వరకూ రాకపోకలు సాగించే ప్రజలు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

యోగా సాధనతో ఏకాగ్రత



సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో యోగా శిక్షణ

సామర్లకోట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యోగా కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాన్నారు. రోజూ కనీసం గంట యోగాకు కేటాయించాలన్నారు. విద్యార్థులు యోగా చేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

లయన్స్ క్లబ్ భవనంలో..

స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో పట్టణ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో యోగా శిక్షణ జరిగింది. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువు సుంకవిల్లి బాపిరాజు శిక్షణ అందించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పుష్పాల నాగగోవిందు, నూకాలమ్మ ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రదీప్, సరస్వతి, ప్రొఫెసర్ మురళీకృష్ణ

బోట్‌క్లబ్: ఇటీవల ఎంసెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు స్థానిక కుళాయిచెరువు పార్కులో ఉన్న ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై వివరించారు. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు కె.ప్రదీప్, సరస్వతి, ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఏ గ్రూపులో చేరితే బాగుంటుందో వివరించారు. ప్రదీప్ మాట్లాడుతూ ఇంటర్ పాసైన విద్యార్థులకు ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కైట్ విద్యాసంస్థల చైర్మన్ పోతుల విశ్వం బృందాన్ని అభినందించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఈ సదస్సు వల్ల తమకు అసలు ఇంజినీరింగ్ అంటే ఏంటో అర్థమైందన్నారు.

రెవెన్యూ శాఖతో పారదర్శక సేవలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలందరికీ పారదర్శక సేవలు అందిస్తున్నట్లు పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ శ్రీరమణి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ తుమ్మల పద్మజ మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక మూల స్తంభం రెవెన్యూ వ్యవస్థ అని అన్నారు. రెవెన్యూ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విశ్రాంత వీఆర్వోలను ఘనంగా సత్కరించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, జట్ల విజయ్‌బాబు, సింగన అరవింద్, నూనె రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో రెవెన్యూ వ్యవస్థ కీలకం

కాకినాడ రూరల్: ప్రజాస్వామ్యంలో రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకమైందని విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు కావడంతో ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూ శాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ఎన్నికలు నిర్వహించాలంటే కీలక పాత్ర పోషించేది రెవెన్యూ శాఖ అని అన్నారు. ట్రస్టు నిర్వాహకుడు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో బాపిరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుద్దరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓం నమశ్శివాయ, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీలతో హడల్



సామర్లకోటలోని అపార్టుమెంట్‌లో మోటార్ సైకిల్ నుంచి పెట్రోలు తీస్తున్న వ్యక్తి

సామర్లకోట: పట్టణంలో ఇటీవల కాలంలో దొంగతనాలు పెరిగిపోయాయి. రెండు రోజుల కిందట పెద్దాపురం రోడ్డులోని సెల్ షాపులో దొంగలు పడి సుమారు రూ.నాలుగు లక్షల విలువైన సెల్‌ఫోన్లు, నగదు చోరీ చేశారు. గురువారం అర్ధరాత్రి గణపతినగరంలోని బోండు నూకరాజు అపార్టుమెంట్‌లోకి దొంగ చొరబడి పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లలోని పెట్రోల్, వాషింగ్ మెషీన్‌లో ఉన్న దుస్తులు దొంగిలించాడు. అపార్టుమెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలో చోరీ ఘటన రికార్డు అయ్యింది. అయితే ముందు జాగ్రత్తగా మంకీ క్యాప్ ధరించడంతో దొంగను గుర్తించడం కష్టంగా మారింది. దొంగ పెట్రోలు తీస్తున్న సమయంలో కుక్కలు మొరుగుతున్నా ఎవరూ బయటకు రాలేదు. చోరీ జరిగిన విషయాన్ని గమనించి సీసీ కెమెరాను యజమాని పరిశీలించడంతో మోటారు సైకిళ్లలో పెట్రోలు చోరీ చేసిన సన్నివేశాలను గమనించారు. ఇటీవల అనేక మంది మోటారు సైకిళ్లలో పెట్రోల్ పోతున్న విషయాలపై చర్చించుకుంటున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదులు అందడం లేదు. కాగా గురువారం అపార్ట్‌మెంట్‌లో జరిగిన చోరీపై బాబూరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా శివకుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ది ఈస్ట్ గోదావరి జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా డాక్టర్ జె.శివకుమార్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ కె.సూర్యారావు తెలిపారు. కాకినాడ జయా రెసిడెన్సీలో ది ఈస్ట్ గోదావరి జిల్లా క్రికెట్ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంలోని ఆరు పోస్టులకు ఎన్నికల అధికారి సూర్యారావు ఎన్నికలు నిర్వహించారు. అయితే ప్రతి పోస్టుకు ఒక్కో నామినేషన్ రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సూర్యారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా డాక్టర్ శివకుమార్, కార్యదర్శిగా కొప్పన ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.బంగార్రాజు, సంయుక్త కార్యదర్శిగా నక్కా శ్రీనగేష్, కోశాధికారిగా బీఎస్ఎన్ మూర్తి, కౌన్సిలర్‌గా ఏపీటీ వర్మ, మెయిల్ రిప్రజెంటేటివ్‌గా బీవీఎస్ నరసింహారావు, ఫిమేల్ రిప్రజెంటేటివ్‌గా మహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ 11 ఏళ్లుగా జిల్లాలో క్రికెట్ క్రీడ అభివృద్ధికి నోచుకోలేదని, ఏసీఏ సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో సీనియర్ క్రికెట్ సంఘ సభ్యులు ఏఎస్ స్వరూప్, బాపిరాజు, డీవీఎస్ రాజు, దంటు భాస్కర్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.